సాక్షి వికారాబాద్

శనివారం । 18 । నవంబర్ । 2023



బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్

బీఆర్‌ఎస్‌కు బిగ్‌షాక్ తగిలింది. కుల్కచర్ల ఎంపీపీ సత్యాహరిశ్చందర్ శుక్రవారం పార్టీకి రాజీనామా చేశారు. 10లో▸



అభివృద్ధి బాధ్యత నాదే

పరిగి నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తనదేనని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 10లో▸



రాయితీలకు మంగళం

రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామంటున్న ప్రభుత్వం.. అందుకు తిలోదకాలు ఇస్తోంది. 11లో▸

న్యూస్‌రీల్

పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దు

కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సుధాకర్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సుధాకర్

కుల్కచర్ల: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వరాదని, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సుధాకర్ గ్జాల్జో ఆదేశించారు. శుక్రవారం కుల్కచర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు, సిబ్బందికి అవసరమైన అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఏపీడీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు

జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్



అంటు వ్యాధులపై ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పరిగి: ఖైదీల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకునేందుకు వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సబ్ జైలులో ఖైదీలకు పరిగి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది హెచ్ఐవీ, టీబీ, ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం అంటు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా ఖైదీల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుందన్నారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ శోభన, వైద్యులు, సిబ్బంది శివప్రసాద్, చంద్రశేఖర్, నరేందర్, గోపాల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

21నుంచి పీవో, ఏపీవోలకు శిక్షణ



వికారాబాద్‌లోని పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాహుల్ శర్మ

అనంతగిరి: ఎన్నికల విధులు నిర్వహించే పీఓ, ఏపీవోలకు మూడు రోజులపాటు మాస్టర్ ట్రైనర్లతో రెండో విడత శిక్షణ కార్యక్రమం ఉంటుందని వికారాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ట్రెనింగ్ నోడల్ ఆఫీసర్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్, మాస్టర్ ట్రైనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21, 22, 23 తేదీల్లో వికారాబాద్ నియోజకవర్గ పీవోలు, ఏపీవోలకు రెండో విడత శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పీవోలు, ఏపీవోలకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్, ఎంపీడీవో సత్తయ్య, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్, తహసీల్దార్ గణేష్, వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, శిక్షకులు పాల్గొన్నారు

వాహన తనిఖీల్లో రూ.8.36 లక్షలు స్వాధీనం



అనంతగిరి: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గురువారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.8,36,348 పట్టుబడ్డాయి. వికారాబాద్ సీఐ శీను ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నేపల్లి నుంచి చిన్నరాములు తన బైక్‌పై నగదు తీసుకెళుతుండగా పట్టుకున్నారు. డబ్బుకు సంబంధించి సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఉపాహారం కొందరికేనా?

- పథకం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా పూర్తి స్థాయిలో అమలు కాని వైనం
- జిల్లాలో ఇప్పటి వరకు 114 పాఠశాలల్లో అమలు
- మిగతా స్కూళ్లలో ఎదురుచూపులు



ఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాలలో స్నాక్స్ తింటున్న విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాహారం కొంత మంది విద్యార్థుల ఆకలి మాత్రమే తీరుస్తోంది. ఇప్పటికే మధ్యాహ్న భోజనం, రాగి జావ అందిస్తున్న ప్రభుత్వం ఉదయం ఉపాహారం పథకాన్ని ఆగస్టు నెలలో ప్రారంభించింది. అయితే ఈ పథకం కొంత మంది విద్యార్థుల ఆకలి మాత్రమే తీరుస్తోంది. దీంతో మిగతా పాఠశాలల విద్యార్థులు పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు ఇస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విద్యాశాఖ కృషి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా మంది విద్యార్థులు వివిధ కారణాలతో ఉదయం ఏమీ తినకుండానే పాఠశాలకు వస్తుంటారు. ఇలాంటి వారు స్కూల్‌లో పెట్టే మధ్యాహ్న భోజనం కోసం ఆకలితో ఎదురు చూస్తుంటారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఉదయం పూట ఉపాహారం అందజేయాలని నిర్ణయించాయి. అయితే పథకం ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో విద్యార్థులు నిరాశ చెందుతున్నారు.జిల్లా వ్యాప్తంగా 146 జెడ్పీహెచ్ఎస్‌లు,112 యూపీఎస్‌లు, 749 పీఎస్‌లు ఉన్నాయి.9ఎయిడెడ్, 9 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 82వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉపాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని,పిల్లల్లో పౌష్టికాహారం లోపం తగ్గించవచ్చని భావించాయి. కానీ చాలా పాఠశాలల్లో పథకం అమలు కాకపోవడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీప గ్రామ పాఠశాలలోని తోటి విద్యార్థులకు ఉపాహారం అందుతున్నా తమకు మాత్రం అందడం లేదని చిన్నారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

114 పాఠశాలల్లోనే..

జిల్లాలో 1,007 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా కేవలం 114 పాఠశాలల్లోనే ఉపాహారం పథకం అమలవుతోంది. అయితే పథకం అమలుకు ప్రత్యేక ఏజెన్సీ అంటూ లేదు. దీంతో ఉపాహారం తయారు చేసేందుకు మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.వారంలో ప్రతి రోజు ఒక మెనూ అమలు చేయాలని నిర్ణయించారు. ఒక రోజు ఇడ్లీ, మరుసటి రోజు ఉప్మా ఇలా ప్రతి రోజూ ఒక టిఫెన్ పెట్టాల్సి ఉంటుంది. అయితే ఒక్కో విద్యార్థి ఉపాహారం కోసం ప్రభుత్వం రూ. 10.50 మాత్రమే ఇస్తోంది. ఈ మొత్తం ఏమాత్రం సరి

మాకు కూడా ఇవ్వాలి



కొన్ని పాఠశాలలకే పరిమితం చేసిన ఉపాహార పథకాన్ని మా పాఠశాలలో కూడా అమలు చేయాలి. పక్క ఊరిలోని పాఠశాల విద్యార్థులకు ఉపాహారం ఇస్తున్నారు. మాకు మాత్రం ఇవ్వడం లేదు. చాలా మంది ఉదయం ఇంటి వద్ద ఏమీ తినకుండానే వస్తున్నారు. ఈ పథకం అమలయితే వారికి మేలు చేకూరుతుంది.

– ఇమ్రాన్, 10వ తరగతి, మదన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్



గొట్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

హస్తం పార్టీ వస్తే ఆగమే

- గ్యారంటీల పేరుతో మభ్యపెడుతున్నారు
- అభివృద్ధికే పట్టం కట్టండి
- బీఆర్ఎస్ తాండూరు అభ్యర్థి రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: కాంగ్రెస్ పార్టీ గెలిస్తే తాండూరు ప్రజలు ఆగం కావడం ఖాయమని, ప్రజలకు అందుబాటులో ఉండి, అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టాలని ఆ పార్టీ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం గొట్లపల్లి, హన్మాపూర్, గిర్మాపూర్, జైరాం తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందన్నారు. ప్రజలు మా వెంటే ఉన్నారని అన్నారు. ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని తెలిపారు. తాండూరు నియోజకవర్గంలో గ్రామాలు తెలియని వారు ఈ ప్రాంత అభివృద్ధికి ఎలా పటుపడతారని అన్నారు. ఈ ఎన్నికల్లో స్థానికేతరులకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నేడు రాష్ట్రం సంక్షేమానికి మారుపేరుగా మారిందన్నారు. రెండో సారి మీ బిడ్డను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తెలంగాణ రాక ముందు వచ్చిన తరువాత ఈ ప్రాంతం ఎలా ఉందో ప్రజలే గుర్తించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముడో సారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తండాలను గ్రామ పంచాయతీలు చేసి, వాటి అభివృద్ధికి రూ. 50లక్షలు మంజూరు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 50 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు ఏమి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు చేయలేని అభివృద్ధి ఇప్పుడు ఎలా చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. మోసపూరిత మాటలు చెప్పే కాంగ్రెస్‌ను తాండూరు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచులు పాండునాయక్, బలవంతురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ప్రవీణ్ పటేల్, నాయకులు రమేష్‌కుమార్, చంద్రశేఖర్, వెంకట్, పూర్యనాయక్, నరేష్‌రెడ్డి, రాంరెడ్డి, రాఘవేందర్ రెడ్డి, అనంతి, ఎల్లప్ప రవి నాయక్, మాణ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఓయూ విద్యార్థులు

తెలంగాణకు విముక్తి కల్పించాలి

- ఓయూ విద్యార్థులు
- కొడంగల్‌కు చేరుకున్న నిరుద్యోగ చైతన్య యాత్ర

కొడంగల్: కేసీఆర్ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించాలని ఓయూ విద్యార్థులు ప్రజలను కోరారు. వారు చేపట్టిన నిరుద్యోగ చైతన్య యాత్ర శుక్రవారం కొడంగల్‌కు చేరుకుంది. పట్టణంలో చైతన్య యాత్ర ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. నోటిఫికేషన్లు వేయడం లేదని, విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ఎంతో కష్టపడి చదువుకొని నిరుద్యోగులుగా మిగిలిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోటీ పరీక్షల పేపర్లను లీకేజీ చేసి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఉన్నత చదువులు చదివిన వారికి బతుకుదెరువు లేకుండా పోయిందన్నారు. ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి బస్సు యాత్ర వాహనం దగ్గరకు వచ్చి అనుమతి పత్రాలను పరిశీలించారు. బస్సు యాత్రకు మాత్రమే అనుమతి ఉందని, ఊరేగింపునకు అనుమతి లేదన్నారు. బస్సులో కూర్చొని తిరగాలని సూచించారు. దీంతో విద్యార్థులు బస్సులో కూర్చొని పట్టణంలో ప్రచారం చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..

విద్యార్థుల ఎంపిక

కొడంగల్: పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి అండర్ –14 కబడ్డీ పోటీల్లో శౌమిక్, అండర్ –17 విభాగంలో రాఘవేంద్ర, భాస్కర్, వెంకటేష్ ఎంపికయ్యారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు శంకర్‌బాబు, పీఈటీ పరశురాముడు, ఉపాధ్యాయులు తెలిపారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన కొడంగల్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు

కంకల్ పాఠశాల నుంచి..

పూడూరు: ఇటీవల కీసరలో జరిగిన ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లా స్థాయి అండర్ –14 బాలికల విభాగం కబడ్డీ పోటీల్లో మండలంలోని కంకల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కంకల్ పాఠశాలకు చెందిన డీ అర్చన, సాయిప్రగతి, బాలుర విభాగంలో మోడల్ స్కూల్ విద్యార్థి చరణ్, సంతోష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. కలా ఉత్సవ్ కాంపిటీషన్‌లో మ్యూజిక్ ఫ్లూట్‌లో వజ్రనిర్ఘోష రాష్ట్రస్థాయిలో 3వ బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. ప్రతిభచాటిన విద్యార్థులను పాఠశాల అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష, పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, పీఈటీ సత్తయ్య, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.





పూడూరు: కబడ్డీ పోటీలకు ఎంపికైన కంకల్ పాఠశాల విద్యార్థినులు, మోడల్ స్కూల్ విద్యార్థులు

బీఆర్‌ఎస్ వస్తే తాండూరును అమ్మేస్తారు

- గులాబీ నేతల మాయమాటలు నమ్మొద్దు
- రాష్ట్రంలో వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే
- కాంగ్రెస్ పార్టీ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి



కందనెల్లిలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: బీఆర్‌ఎస్‌కు మరోసారి ఓటేస్తే తాండూరును అమ్మేస్తారని కాంగ్రెస్ పార్టీ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పెద్దేముల్ మండలం కందనెల్లి, ఖానాపూర్, రుక్మాపూర్, రెగొండి, కొండాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను చచ్చే వరకు కాంగ్రెస్‌లోనే ఉంటానని, గెలిచిన తరువాత పార్టీ ఫిరాయించే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. ఒక వేళ పార్టీ మారితే తరిమి కొట్టాలన్నారు. సుద్ద, ఇసుక మాఫీయాను కాదని తెలిపారు. నిత్యం అందుబాటులో ఉంటూ తాండూరు ప్రజలకు సేవ చేస్తానని హామీ ఇచ్చారు. మాయమాటలతో మోసం చేసేందుకు వచ్చే బీఆర్ఎస్ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గులాబీ పార్టీ నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఓటమి భయంతోనే హామీలు ఇస్తున్నారని, వారి మాటలను నమ్మరాదని ప్రజలకు సూచించారు. తెలంగాణలో వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తరహాలో ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీపై మొదటి సంతకం చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ అమలు చేసిన పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందన్నారు. తాను ప్రజలకు సేవ చేయడానికి ఇక్కడికి వచ్చానని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు మళ్లీ ఓటు వేసి మోసపోవద్దని, ఆ పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ ధారాసింగ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ తాండూరు ఏ– బ్లాక్ ప్రెసిడెంట్ లోంక నర్సింలు, మండల వైస్ ప్రెసిడెంట్ మధులత, మాజీ వైస్ ఎంపీపీ రామ్‌గోపాల్, మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్, రుక్మాపూర్ సర్పంచ్ శివలీల, నాయకులు మైపాల్ రెడ్డి, జితేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సంగయ్య, రియాజ్, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం రాత్రి చీకట్లో వైద్యం పొందుతున్న రోగులు

చీకట్లో వైద్యం

- విద్యుత్ సరఫరా ఆగిపోవడం, జనరేటర్ లేకపోవడంతో అవస్థలు
- దోమ ఆస్పత్రిలో సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో చికిత్సలు

దోమ: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాల్లో శుక్రవారం రాత్రి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇటు వైద్య సిబ్బంది, అటు రోగులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. దోమ ప్రభుత్వ ఆస్పత్రికి జనరేటర్ లేకపోవడంతో కరెంటు పోయినప్పుడు రోగులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోనిఐనాపూర్‌కు చెందిన జీ నర్సింహులు తన కుమార్తె డెలివరీ కోసం ఉదయం దోమ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చాడు. మధ్యాహ్నం ఆమె ప్రసవించగా వైద్యులు ఆస్పత్రిలో ఉండాలని సూచించారు. అయితే రాత్రి విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో సెల్‌ఫోన్లు, టార్చిలైట్ల ఆమెకు వైద్యం చేశారు. మరి కొందరు కూడా చీకట్లోనే వైద్యం చేయించుకోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఆస్పత్రికి జనరేటర్ మంజూరు చేయాలని రోగులు కోరారు.

నా హయాంలోనే అభివృద్ధి

- కొడంగల్‌కు కేసీఆర్ చేసిందేమీ లేదు
- పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

బొంరాస్‌పేట: తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఉమ్మడి బొంరాస్‌పేట మండలం అభివృద్ధి చెందిందని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బొంరాస్‌పేట, దుద్యాల మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పదేళ్ల పాలనలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని, సీఎం కేసీఆర్ కొడంగల్‌కు హామీలు ఇచ్చారే తప్ప అమలు చేయలేదని ఆరోపించారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి కృష్ణా జలాలతో ఈ ప్రాంత ప్రజల కాళ్లు కడుగుతానని చెప్పిన కేసీఆర్ మాట నిలుపుకోలేదని ఆరోపించారు. తనను అక్రమంగా అరెస్టు చేసి కొడంగల్‌లో ఓడించారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమల చేస్తామని హామీ ఇచ్చారు. రూ. 2వేల పింఛన్‌ను రూ. 4వేలకు పెంచుతామని, రూ. 400కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని అన్నారు. మహిళలు బాజాప్తాగా బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. దుద్యాలను పేరుకు మాత్రమే మండల కేంద్రం చేసి వదిలేశారని ఆరోపించారు. అల్లిఖాన్‌పల్లి రోడ్డు, అన్ని గ్రామాల్లో బీటీ రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కోస్గి నాయకులు సంజీవరెడ్డి, రామకృష్ణారెడ్డి, మహేష్‌రెడ్డి, హన్మంతు, శ్రీధర్‌గౌడ్, ఆనంద్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి రేవంత్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, పార్టీ పలు మండలాల అధ్యక్షులు నర్సింలుగౌడ్, ఆవుటి శేఖర్, రాంచంద్రారెడ్డి, నర్సింలునాయుడు, వెంకట్రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్‌కు 'ఏకగ్రీవం'!

ఎన్నికల వేళ అధికార పార్టీకి చెందిన పలువురు ఏకగ్రీవ సర్పంచ్‌లు సమరానికి సై అంటున్నారు. యునానిమస్‌గా ఎన్నికైన పల్లెల అభివృద్ధికి ప్రత్యేక నిధులిస్తామని.. ఐదేళ్లయినా విడుదల చేయకపోవడంతో ప్రభుత్వంపై తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. పంచాయతీల్లో ప్రభుత్వం పిలుపునిచ్చిన ప్రతీపని చేపట్టి అప్పులపాలైనామంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఐదుగురు ఏకగ్రీవ సర్పంచ్‌లు బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ గూటికి చేరారు. జిల్లా వ్యాప్తంగా మరికొందరు అదేబాటలో ఉన్నారనే చర్చలు సాగుతుండంతో అధికార పార్టీ అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు.

'కారు'కు షాకిస్తున్న యునానిమస్ జీపీలు

- రూ.10 లక్షల నజరానా ఇవ్వకపోవడంపై సర్పంచ్‌ల గుస్సా
- 'గులాబీ' అభ్యర్థుల్లో గుబులు



జంగ్ తెలంగాణ

బషీరాబాద్: జిల్లాలో అధికార పార్టీ అసెంబ్లీ అభ్యర్థులకు కొత్త తంటాలు తలనొప్పి తెప్పిస్తున్నాయి. కొత్త పంచాయతీలు తమకు అండగా నిలుస్తాయని ఆశపడిన అధికార బీఆర్‌ఎస్‌కు రిక్త హస్తం చూపుతున్నాయి. 2019 పంచాయతీ ఎన్నికల్లో యునానిమస్ చేసుకునే జీపీలకు ప్రభుత్వం అధికారికంగా రూ.10లక్షల నజరాన ప్రకటించింది. 566 పంచాయతీలకు గాను 90 శాతం వరకు అధికార పార్టీ మద్దతుదారులు గెలుపొందారు. ఇందులో 71 కొత్త పంచాయతీలు రూ.10లక్షల నిధులు వస్తాయనే ఆలోచనతో పార్టీలకు అతీతంగా ఏకగ్రీవం చేసుకున్నాయి. ఈ పంచాయతీల్లో గిరిజన తండాలు, అనుబంధ గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం మరో మూడు నెలల్లో ముగియనుండగా. ప్రభుత్వం నేటికీ నిధులు విడుదల చేయలేదు. ఇదే విషయమై సర్పంచ్‌లు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. నయాపైసా ఇచ్చేది లేదని ఏడాది కిందటే తేల్చిచెప్పింది. దీనికి తోడు పంచాయతీలకు ప్రతీనెలా రావాల్సిన నిధులను ఫ్రీజింగ్ చేయడం, జీపీ కార్మికులకు వేతనాలు పెంచామని చెప్పి నిధులు విడుదల చేయక పోవడం వంటి చర్యలు చేపట్టింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పోరాటాలు చేశారు. వెరసి ఈ ఎన్నికల్లో మెజార్టీ ఏకగ్రీవ సర్పంచ్‌లు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. బషీరాబాద్ మండల పరిధిలో ఏడు పంచాయతీలు ఏకగ్రీవమవ్వగా ఇప్పటికే ఐదు జీపీల సర్పంచ్‌లు బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి హస్తం గూటికి చేరారు.

తండాల్లో 'ఇందిరమ్మ' జపం!

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గిరిజన తండాలు పంచాయతీలుగా మారాయి. కానీ ఒక్క తండాలోనూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. అటవీ భూములు సాగు చేసిన 90శాతంపైగా గిరిజనులకు నిబంధనల సాకుతో పట్టాలు ఇవ్వలేదు. దీంతో బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రచారంలో గిరిజనులు ఇళ్లు, భూముల విషయాలపై నిలదీస్తున్నారు. తమకు ఇందిరమ్మ కాలంలోనే ఇళ్లు, భూములు వచ్చాయని గుర్తు చేస్తున్నారు. నేటికి ఇందిరమ్మ ఇచ్చిన భూమిచేసుకొని బతుకుతున్నామని అంటున్నారు. ఇందిరమ్మ రాజ్యం రావాలని కోరుకుంటున్నట్లు బషీరాబాద్ మండలం బాద్లాపూర్‌తండాకు చెందిన పలువురు మహిళలు సాక్షితో చెప్పారు.

'గులాబీ'పై సర్పంచ్‌ల గుర్రు

బీఆర్‌ఎస్ సర్కారు సర్పంచులపై సవతి ప్రేమ చూపింది. నేరుగా జీపీలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పి నిండా ముంచిందని మండిపడుతున్నారు. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినా.. నేటికి చాలా గ్రామాలకు బిల్లులురాలేదని సర్పంచ్‌ల సంఘాలు సర్కారుపై ఒంటి కాలుమీద లేస్తున్నారు. అభివృద్ధి పనుల కోసం చేసిన అప్పులను తీర్చడానికి కొందరు భూములు అమ్ముకున్నారు. మరికొందరు పేద సర్పంచులు అప్పులపాలై వ్యవసాయ కూలీలుగా, అడ్డమీది లేబర్లుగా పనుల్లో చేరారని మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన ప్రభుత్వ సమావేశాల్లో సర్పంచ్‌లు బిల్లులపై లొల్లి పెట్టారు. తమకు రావాల్సిన బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని.. పార్టీకి రాజీనామాలు చేస్తామని హెచ్చరికలు జారీ చేసిన ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో బీఆర్‌ఎస్‌పై గుర్రుగా ఉన్నారు.

నిధులన్నీ పెండింగ్



ఏడాది క్రితం ఎస్సీఎస్పీ నిధుల నుంచి గ్రామంలో సీసీ రోడ్లు, ఇతర పనులు చేపట్టాను. పనులకు సంబంధించి ఎంబీ రికార్డులు కూడా అయ్యాయి. కానీ నాకు రావాల్సిన రూ.4.60 లక్షల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏకగ్రీవం చేస్తే రూ.10లక్షల నిధులు ఇస్తామన్నారు అవి కూడా రాలేవు. చాలా విషయాల్లో సర్కారు తమను సతాయించింది. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్‌లోనే కొనసాగినం. ఇప్పుడు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చింది. ఈ ఎన్నికల్లో దిమ్మతిరిగేలా ఓట్లతో సమాధానం చెబుతాం.

– రవీందర్, ఏకగ్రీవ సర్పంచ్, కొత్లాపూర్

అప్పుల పాలయ్యాం



నూతన పంచాయతీల్లో ఆర్థిక వనరులు లేక ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయాం. ఏకగ్రీవం చేస్తే రూ.10లక్షల నిధులు నజరాన ఇస్తామని ప్రభుత్వం అప్పట్లో మాట ఇచ్చింది. కానీ నేటికి అమలు కాలేదు. అధికార పార్టీలో ఉండి గ్రామాల్లో పనులు చేసి అప్పుల పాలయ్యాం. ప్రభుత్వం సర్పంచ్‌లను మోసం చేసింది. ఇప్పుడు ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తాం.

– పద్మ, ఏకగ్రీవ సర్పంచ్, కుప్పన్‌కోట్

ఇదిగో బొట్టు.. మీరే గెలిచేట్టు



మాజీమంత్రి ప్రసాద్‌కుమార్‌కు బొట్టుపెడుతున్న మహిళ

ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌కు కేరెళ్లి వాసులు ఘన స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన మహిళ ఆయనకు బొట్టు పెట్టి హారతిచ్చి అన్నా.. మీ చెల్లిగా ఆశీర్వదిస్తున్నా వికారాబాద్‌లో మీ విజయంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని దీవెన పెట్టింది. – ధారూరు

బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్



కాంగ్రెస్‌లో చేరుతున్న సత్యహరిశ్చందర్

'కారు' దిగి కాంగ్రెస్‌లోకి కుల్కచర్ల ఎంపీపీ

పరిగి: ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో బీఆర్‌ఎస్‌కు బిగ్‌షాక్ తగిలింది. కుల్కచర్ల ఎంపీపీ సత్య హరిశ్చందర్ శుక్రవారం పార్టీకి రాజీనామా చేసి డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా టీఆర్ఆర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. భవిష్యత్‌లోనూ వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సొంత పార్టీ నాయకులనే ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. గిరిజన ప్రజాప్రతినిధులు చులకనగా చూడడం వారికి పరిపాటి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అగ్రవర్ణాలకు పెద్దపీట వేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు భూములు పంచితే వారి నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కుంటోదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి గిరిజనులపై అక్రమ కేసులు బనాయిస్తూ.. ఇబ్బంది పెడుతున్నారన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. తాను గిరిజన మహిళ అయినందునే ప్రజలకు సేవ చేయకుండా ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీలో చేరానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రయ్య, నాయకులు రవినాయర్, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

<table>
<tr><td>

CITATION
IN THE COURT OF SENIOR CIVIL JUDGE AT CHINCHOLI
O.S No. 43/2023
VERSUS
Sakeena Begum & Others — Azeem bee & Others

To.

D6] **Rafath D/o Late. Mainu Patel W/o Bashir Patel,** age: 25 years, occupation: agriculture and Household, R/o Gotlapally Village, Mandal Peddemol Tq. Tandur District Vikarabad (Telangana).

D7] **Sony D/o Mainu Patel,** age: 23 years, occupation: agriculture and Household, R/o Sangareddy Village Tq. And Dist. Sangareddy.

D8] **Mohsin S/o Late. Abdulmiya,** age: 36 years, occupation: agriculture, R/o H.No.4-137, Street No.10, Premnagar, Sherilingampally, Hyderabad (Telangana).

D9] **Shaheen Begum W/o Zakeer,** age: 33 years, occupation: agriculture, R/o H.No.3-118, Street No.10, Premnagar, Sherilingampally, Hyderabad (Telangana).

D10] **Maheboob Begum W/o Gouse Miya,** age: 30 years, occupation: agriculture, R/o H.No.3-302, Street No.4, Aditya Nagar, Sherilingampally, Hyderabad (Telangana).

D11] **Riyaz Miya S/o Abdul Miya,** age: 25 years, occupation: agriculture, R/o H.No.3-417, Street No.6, Aditya Nagar, Sherilingampally, Hyderabad (Telangana).

D12] **Raheema Begum W/o Manjlemiya,** age: 49 years, occupation: agriculture, R/o Mithabaspally Tq. Tandur Dist. Vikarabad.

D13] **Naseema Begum W/o Anwar,** age: 47 years, occupation: agriculture, R/o H.No. 1-12179, Number Kishanganj, Bahaddurpura, Rajendra Nagar, Hyderabad (Telangana).

Whereas the above named plaintiff has instituted against the defendant for **suit for Partition and Separate possession and correction of revenue records** summons/notices and RPAD were issued returned of **Deft No.6 to 13** un served as you are intentionally avoiding to receive the same. Hence you are hereby directed to appear in this court in person or by pleader duly instructed to answer all materials questions, relating to the case or accompanied by some person able to answer in the above matter on 11-12-2023 at 11.00 AM failing which the matter will be determined according to law.

Take notice that in default of your appearance on the day mentioned above the case will heard and decided in your absence.

Given under my hand and the seal of this court the 15th day of November 2023.

Through
Sd/- **Vijaykumar H. Rathod**
Advocate, Chincholi

By order of the court
Sd/- Chief Ministerial officer
Senior Civil Judge at Chincholi

</td></tr>
</table>

నిరంతరం తనిఖీలు

పెద్దేముల్: ఎన్నికల నేపథ్యంలో తాండూరు–హైదరాబాద్, తాండూరు–జహీరాబాద్ ప్రధాన రహదారులపై పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు నగదు, మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. శుక్రవారం పెద్దేముల్– తాండూరు మండలాల మధ్య కందనెల్లి సమీపంలో జిల్లా ఏస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు సోదాలు చేశామని ఎస్ఐ వివరించారు.

ప్రచారానికి పటిష్ట బందోబస్తు

వికారాబాద్ ఎమ్మెల్యే స్వగ్రామంలో పోలీసుల పహారా



పోలీసుల సమక్షంలో మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ రోడ్‌షో

ధారూరు: ఎన్నికల వేళ కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ఆయా పార్టీల అభిమానులకు పోలీసులు కళ్లెం వేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ స్వగ్రామమైన కేరెళ్లిలో శుక్రవారం కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం చేపట్టింది. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కొంతమంది ఆకతాయిలు కొట్లాటకు పాల్పడనున్నట్లు ముందస్తు సమాచారంతో ఎస్ఐ సంతోష్‌కుమార్ స్పెషల్ ఫోర్స్‌తో పర్యవేక్షించారు. మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ గ్రామానికి రావడంతో పెద్దఎత్తున పోలీసుల మోహరింపుతో ఆకతాయిలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పరిగి అభివృద్ధి బాధ్యత నాదే



మహేశ్‌రెడ్డి ప్రచారానికి హాజరైన చాకల్‌పల్లి గ్రామస్తులు

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: పరిగి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి ప్రకటించారు. మండలంలోని ముక్తవెంకటాపూర్, వీరాపూర్, మల్కాపూర్, బంగ్రంపల్లి, కిష్ణంపల్లి, చాకల్‌పల్లి, కల్మన్‌కాల్వ, కొత్తపల్లి, పుర్సంపల్లి, మరికల్ గ్రామాల్లో శుక్రవారం ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. ఎన్నికల వేళ ప్రజలు ఆలోచించి నిర్ణయాన్ని తీసుకోవాలని, మోసపూరిత మాటలు నమ్మితే ఐదేళ్ల పాటు గోస పడాల్సి వస్తుందన్నారు. చౌడాపూర్ మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్ నాయక్, బీఆర్‌ఎస్ చౌడాపూర్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ నాగరాజు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, యువజన విభాగం అధ్యక్షుడు మేగ్యానాయక్, నాయకులు నర్సింలు, చెన్నయ్య, అశోక్, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మర్పల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని ఆ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జంషేడ్‌పూర్, రామపూర్, పట్లూర్ జీపీ తాండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అన్నిరంగాల్లో పురోగతి సాధించిందన్నారు. మరోసారి ఆశీర్వదించి కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మధూకర్, పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి నాయకులు ప్రభాకర్‌గుప్తా, అశోక్, రమేశ్ మిత్ర, రాచన్న, మధూకర్, గౌస్, గఫార్, సర్పంచ్‌లు నూరొద్దీన్, ఇందిర, ఎంపీటీసీ సభ్యుడు బిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎమ్మెల్యేకు నిరసన సెగ

- ఇరు పార్టీల నాయకుల మధ్య ఘర్షణ
- కాంగ్రెస్ నాయకులను స్టేషన్‌కు తరలించిన పోలీసులు

షాబాద్: ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ అభ్యర్థులకు పలుచోట్ల నిరసన సెగలు తగులుతున్నాయి. శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మండల పరిధిలోని అంతారం, కేసారం, బోడంపహాడ్ గ్రామంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో దళిత బంధు, ఇల్లు, పింఛన్‌లు తదితర విషయాలపై ప్రజలు ఆయన్ను నిలదీశారు. బోడంపహాడ్‌లో గ్రామంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు కాంగ్రెస్ నాయకులను పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తరలించడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం ఎమ్మెల్యే ప్రచారం కొన సాగింది.

<table>
<tr><td>

<u>**Format C-1**</u>

(for candidate to publish in News Papers, TV)

<u>**Declaration about Criminal Cases**</u>

(As per the Judgement dated 25th September 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs, Union of India & Anr).

Name and address of Candidate: **PEDDINTI NAVEEN KUMAR**

Name of Political Party : **BARATIYA JANATA PARTY**

(Independent candidates should write "Independent" here)

Name of Election: **Telangana State Legislative Assembly 2023**

Name of Constituency: **55-Vikarabad (SC) Assembly Constituency**

I, **PEDDINTI NAVEEN KUMAR,** (name of candidate) a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending Criminal Cases

Sl. No.	Name of the Court	Case No. and dated	Status of case(s)	Section(s) of Acts concerned and brief description of offence(s)
1	Hon'ble Court of Assistant sessions Judge Vikarabad District at Vikarabad	SC No. 94/2022	Charges	Section 306 R/W Section 34 I.P.C

(B) Details about cases of conviction for criminal offences

Sl. No.	Name of the Court& date(s) of Order(s)	Description of office(s) & punishment imposed	Maximum punishment imposed
-	-	-	-

PEDDINTI NAVEEN KUMAR, 55-Vikarabad (SC)

</td></tr>
</table>

ప్రచారంలో పార్టీ పదవులు



కందుకూరు: నియామకపత్రం అందుకుంటున్న శ్రీధర్



బడంగ్‌పేట్: శ్రీధర్‌కు నియామకపత్రం అందజేస్తున్న సబితారెడ్డి

- బీఆర్‌ఎస్ నియోజకవర్గం సెక్రటరీగా శ్రీధర్
- బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా మురళీకృష్ణ

కందుకూరు: బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గం సెక్రటరీగా మండల పరిధిలోని లేమూరుకు చెందిన ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ....తనపై నమ్మకం ఉంచి పార్టీ పదవి అప్పగించినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సబితమ్మ గెలుపుకు కష్టపడి పని చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎ.అంజయ్యగౌడ్, మేఘనాథ్‌రెడ్డి, చిర్ర సాయిలు, మంద సాయిలు, కాకి రాములు, కుమార్, అమరేందర్‌రెడ్డి, పి.ఆనంద్, డి.జంగయ్య, దేశం కృష్ణారెడ్డి, జైపాల్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి వంచన లేకుండా పనిచేస్తా

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌కు చెందిన మురళీకృష్ణను పార్టీ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మహేశ్వరం అసెంబ్లీ అభ్యర్థి సబితారెడ్డి నియామకపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు శక్తివంచన లేకుండ పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీమిడి స్వప్న, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.